RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

సంపుటి - 1 సంచిక - 173 బుధవారం 20 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

గెలుపు గుర్రాలకే

లోక్ సభ అభ్యర్థిత్వం



4లో.

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పనిచేయుటకు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని

అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103

# పంచ 'న్యాయ్'లతో

## ప్రజలకు న్యాయం



ఐదు 'న్యాయ్' గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్ నేతల నిర్ణయం

దేశం మార్పు కోరుతోంది: ఖర్గే

మోదీ గ్యారంటీలకు 'ఇండియా షైనింగ్' గతేనంటూ విమర్శలు

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త):**(ఢిల్లీ): సార్వత్రిక ఎన్నికల్లో రైతులు, మహిళలు, యువత, శ్రామికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఇచ్చిన ఐదు ప్రధాన గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. భాగీదారి న్యాయ్, కిసాన్ న్యాయ్, నారీ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, యువ న్యాయ్ దేశ ప్రజలకు న్యాయం దక్కేలా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. యువత, మహిళలు, కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల కోసం రూపొందించిన ఈ ఐదు 'న్యాయ్' హామీలను దేశవ్యాప్తంగా ప్రతి ఇంటి చెంతకు చేర్చాలని పార్టీ పిలుపునిచ్చింది. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో హామీలను ఇచ్చి, అమలు చేసిన మాదిరే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ తన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పిం చాలని నిర్ణయించింది. మిగతా 2లో.

# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్



- నలుగురు తెలంగాణ మావోయిస్టు అగ్రనేతల హతం
- ఎన్నికల నేపథ్యంలో విధ్వంస కార్యకలాపాల కోసం
- తెలంగాణ నుంచి మహారాష్ట్రలో అడుగుపెట్టిన నక్సల్స్
- పక్కా సమాచారంతో పలు బృందాలను రంగంలోకి దింపిన పోలీసులు
- ఈ ఉదయం కొలమార్క పర్వత ప్రాంతంలో ఎదురుకాల్పులు
- హతమైన నక్సల్స్ తలపై రూ. 36 లక్షల రివార్డు

2లో.

# మల్కాజ్‌గిరి వాడినే నిలబెట్టు లేదంటే నీ సంగతి చెబుతా



2లో.

: ఈటల రాజేందర్ హెచ్చరిక

తనకు మల్కాజ్‌గిరితో ఏం సంబంధమని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నాడని ఆగ్రహం

ఆయన కూడా ఈ ప్రాంతం వాడినే అభ్యర్థిగా నిలబెట్టాలని సవాల్

బయటి వ్యక్తిని నిలబెడితే ఊరుకునేది లేదన్న ఈటల రాజేందర్

# తెలంగాణ గవర్నర్‌గా రాధాకృష్ణన్



తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియమితులయ్యారు. గవర్నర్ తమిళి సై రాజీనామాకు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఆమె స్థానంలో ప్రస్తుతం జార?ండ్ గవర్నర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీపీ రాధాకృష్ణన్‌కు బాధ్యతలు అప్పగించింది.తెలంగాణతో పాటు తమిళి సై చూసిన పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ బాధ్యతలను కూడా ప్రెసిడెంట్ రాధాకృష్ణన్‌కే అప్పజెప్పిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇవాళ రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణకు పూర్తి స్థాయి గవర్నర్‌ను నియమించే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, తెలంగాణ గవర్నర్‌గా నియామకమైన రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు అయ్యింది.

# సీఏఏపై స్టే ఇవ్వం

సీఏఏపై స్టే ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో 230 పిటిషన్లు దాఖలు

స్టే ఇవ్వం ఇచ్చేందుకు నిరాకరించిన సీజేఐ బెంచ్



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త):**(ఢిల్లీ): కేంద్రం ఇటీవల సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం) అమల్లోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అయితే సీఏఏను వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. సీఏఏ అమలుపై స్టే ఇవ్వాలంటూ 230 పిటిషన్లు దాఖలు కాగా, సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లను సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జేబీ పార్ధీవాలాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. సీఏఏ అమలుపై స్టే ఇచ్చేందుకు సీజేఐ బెంచ్ నిరాకరించింది. ఈ క్రమంలో, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీఏఏ వద్దంటూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందుకు మూడు వారాల గడువు విధించింది. అనంతరం, తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. కేంద్రం ఏప్రిల్ 8వ తేదీ నాటికి వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

# ప్రధాని మోదీ 'శక్తి' వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

రాహుల్ గాంధీ 'శక్తి' వ్యాఖ్యల్ని ప్రధాని నరేంద్రమోదీ వక్రీకరించారని ఫిర్యాదు

ప్రధాని మోదీ వ్యాఖ్యలు కోడ్ ఉల్లంఘన కిందకే వస్తాయన్న కాంగ్రెస్ నేతలు

రాహుల్ గాంధీపై ఉద్దేశ్యపూర్వకంగా అబద్ధపు ప్రచారం చేశారన్న భట్టివిక్రమార్క

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ 'శక్తి' వ్యాఖ్యల్ని ప్రధాని నరేంద్రమోదీ వక్రీకరించారని, ఆయన వ్యాఖ్యలు కోడ్ ఉల్లంఘన కిందకే వస్తాయని కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. భారత్ న్యాయ్ యాత్రలో రాహుల్ గాంధీ 'శక్తి'పై చేసిన వ్యాఖ్యల ఉద్దేశ్యం వేరని... వాటిని ప్రధాని వేరే అర్థం వచ్చేలా జగిత్యాల సభలో చెప్పారని ఆరోపించారు. ఈ సభలో మోదీ చేసిన వ్యాఖ్యలకు గాను చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేరకు తెలంగాణ



ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ప్రధాని వక్రీకరించారని ఆరోపించారు. రాహుల్ గాంధీపై ఉద్దేశ్యపూర్వకంగా అబద్ధపు ప్రచారం చేశారని మండిపడ్డారు. ప్రధాని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు.

# అమ్మను కలిసేందుకు కవితకు అనుమతి



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త):**(ఢిల్లీ): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై ఇడి కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మె ల్సీ కవిత 'మా అమ్మను కలిసేందుకు అనుమతిం చండి' అంటూ న్యాయస్థా నాన్ని అభ్యర్థించారు. తల్లితో పాటు కుమారులను కలుసుకునేందుకు కూడా అనుమతించాలని న్యాయ స్థానాన్ని కోరారు. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టు లో కవిత తరపు న్యాయవాదులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కవి త అభ్యర్థనకు న్యాయస్థానం అంగీ కరించింది. తల్లి శోభ, కుమారులు ఆది త్య, ఆర్య, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డిల ను కలుసుకునేందుకు న్యాయ స్థానాన్ని కవిత అనుమతి కోరారు. ఈ క్రమం లో తల్లీ, కుమారులు, కుటుంబసభ్యులను కలిసేందుకు కవితను న్యాయ స్థానం అనుమతిం చింది. కాగా ఇడి కస్టడీకి అనుమతించిన శనివారం రోజు భర్త అనిల్, సోదరుడు కెటిఆర్, బావ హరీశ్ రావు, కజిన్ బ్రదర్స్ పి శ్రీధర్, ప్రణీత్ కుమార్, పిఎ శరత్ చంద్రలను కలుసుకునేందుకు కోర్టు అంగీ కరించిన విషయం విదితమే. కస్టడీలో ఉన్న ఏడు రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య బంధువులను కలుసుకు నేందుకు కవితకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఎక్కువ మంది ని కలవడం వల్ల దర్యాప్తుకు ఆటంకం కలుగుతుందని మంగళవారం కవిత తాజా పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ముం దుగా అనుమతించిన వారిలో కేటీఆర్ పేరుతో పాటు తల్లి, కుమారులు, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డి కలిసేందుకు అనుమతించాలని కవిత తరపు న్యాయవాదులు వెల్లడించారు. దీంతో ఆ మేరకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది.

# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్..

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:**
మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలు నలుగురు హతమయ్యారు. వీరి తలపై రూ. 36 లక్షల రివార్డు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ప్రాణహిత నదిని దాటి తెలంగాణ నుంచి కొందరు మావోయిస్టులు గడ్చిరోలిలో అడుగుపెట్టినట్టు సోమవారం మధ్యాహ్నం పోలీసులకు పక్కా సమాచారం అందింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విధ్వంస కార్యకలాపాలే లక్ష్యంగా వీరు మహారాష్ట్రలో అడుగుపెట్టినట్టు ఎస్పీ నీలోత్పల్ తెలిపారు.
సమాచారం అందిన వెంటనే గడ్చిరోలి పోలీసుల ప్రత్యేక పోరాట విభాగమైన %జ%-60కి చెందిన పలు బృందాలతోపాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కు చెందిన క్విక్ రెస్పాన్స్ టీంను రంగంలోకి దింపారు. ఈ ఉదయం సి-20 బృందం సెర్చ్ ఆపరేషన్‌లో ఉండగా రేపనపల్లి సమీపంలోని కొలమార్క పర్వత ప్రాంతంలో నక్సలైట్లు కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు బృందాలు ఎదురుకాల్పులు జరిపాయి.
కాల్పులు ఆగిన తర్వాత ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా నలుగురు నక్సలైట్ల మృతదేహాలు ఆ ప్రాంతంలో కనిపించాయి. వారి తలలపై రూ. 36 లక్షల రివార్డు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వీరందరూ తెలంగాణ కమిటీకి చెందినవారేనని పోలీసులు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో హతమైన నక్సల్స్‌లో ఇద్దరిని వర్గీశ్, మగ్తు గుర్తించారు. వర్గీశ్ మంచిర్యాల డివిజన్ సెక్రటరీ కాగా, మగ్తు చెన్నూరు ఏరియా కమిటీ సెక్రటరీ. మరో ఇద్దరిని ప్లాటూన్ సభ్యులు కుర్సంగ్ రాజు, కుడిమెట్ట వెంకటేశ్‌గా గుర్తించినట్టు పోలీసులు వివరించారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47 తుపాకులు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

# 14 లోక్ సభ సీట్లు తప్పకుండా గెలుస్తాం

## : కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:**
పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కనీసం 14 లోక్ సభ సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ ధీమా వ్యక్తం చేశారు. ఆయన ఎన్టీవీ 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో ఆశించిన సీట్లు గెలుచుకోలేదని అందుకే కాంగ్రెస్ స్థానాలు 65కు పరిమితం అయినట్లు చెప్పారు. ఆరు గ్యారెంటీలు సహా ఇవ్వని హామీలను కూడా తాము అమలు చేస్తున్నామన్నారు. 100 రోజుల్లో ఆరింట ఐదు గ్యారెంటీలు అమలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. కానీ కేసీఆర్ పదేళ్ల కాలంలో ఆయన చెప్పిన వాటిలో 10 శాతం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. పైగా 4 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయన్నారు. తమకు కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుతో చిప్ప చేతికి ఇచ్చారని మండిపడ్డారు. అయినప్పటికీ పథకాల విషయంలో కేసీఆర్‌లా తాము మోసం చేయబోమని... ఆర్థిక పరిస్థితి బాగాలేదని... ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలు చేశామన్నారు. మిగతా వాటిని కూడా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కాలేదు... అప్పుడే విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. అలా విమర్శించే వారికి సిగ్గుండాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపించారు. కాళేశ్వరం సహా వివిధ ప్రాజెక్టుల్లో బీఆర్ఎస్ అవినీతిపై పూర్తి నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. మేడిగడ్డపై పకడ్బందీగా విచారణ జరిపిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అవినీతిపై బీజేపీ తమను ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ పదేళ్లపాటు అధికారంలో ఉండి ఏమీ చేయలేదని... కానీ తాము అన్ని నివేదికల తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.

# మల్కాజ్‌గిరి వాడినే నిలబెట్టు లేదంటే నీ సంగతి చెబుతా



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:**
నాకు మల్కాజ్‌గిరితో ఏం సంబంధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు... అలాంటప్పుడు ఆయన కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ ప్రాంతం వాడినే నిలబెట్టాలి... లేదంటే ఆయన సంగతి చెబుతానని బీజేపీ లోక్ సభ అభ్యర్థి ఈటల రాజేందర్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే మల్కాజ్‌గిరి ప్రాంతం వాడినే తనపై పోటీకి నిలపాలని సవాల్ చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... మల్కాజ్‌గిరితో తనకు ఏం సంబంధం? అని ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రికి నేను ఓ సవాల్ విసురుతున్నాను... నిజంగా నీకు దమ్ముంటే ఈ ప్రాంతం నుంచి తనపై పోటీకి నిలుపు అన్నారు. బయటి వ్యక్తిని నిలబెడితే ఊరుకునేది లేదన్నారు. రేవంత్ రెడ్డి అభ్యర్థి కోసం వెతుకుతున్నాడని... రూ.200 కోట్లు ఖర్చు పెట్టే అభ్యర్థి వారికి కావాలట అని ఎద్దేవా చేశారు. ఈటల రాజేందర్‌ను తట్టుకోవాలంటే రూ.400 కోట్లు ఖర్చు పెట్టే వ్యక్తి కావాలని పేర్కొన్నారు.

## తెలంగాణలో 30,000 ఉద్యోగాలు ఇచ్చామన్న ఢిల్లీ కాంగ్రెస్ నేతలు...

# 'ఫ్యాక్ట్ చెక్' పేరుతో బీఆర్ఎస్ కౌంటర్

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:**
తెలంగాణలో ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలు ఇచ్చిందని కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో చెప్పడంపై బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. తమ హయాంలో వచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకోవడం ద్వారా క్రెడిట్ కొట్టేసే ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ పేర్కొంది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేసిన వ్యాఖ్యలను ట్వీట్ చేస్తూ... ఫ్యాక్ట్ చెక్ పేరుతో కౌంటర్ ఇచ్చింది.తెలంగాణలో మూడు నెలల కాంగ్రెస్ పాలనలోనే 30,000 ఉద్యోగాలు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




చెప్పారని... తాము ఇచ్చింది ప్రభుత్వ ఉద్యోగాలేనని కేసీ వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. ఈ వ్యాఖ్యలను బీఆర్ఎస్ రీట్వీట్ చేస్తూ తమ హయాంలో వచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ సిగ్గులేకుండా తాము ఇచ్చినట్లు చెప్పుకుంటోందని మండిపడింది. వాస్తవం కాంగ్రెస్ నేతలు చెప్పిన దానికి భిన్నంగా ఉందని పేర్కొంది.మొత్తం 30,000 ఉద్యోగ నోటిఫికేషన్‌లు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జారీ చేశామని... కేసీఆర్ ప్రభుత్వమే నోటిఫికేషన్‌లను జారీ చేసిందని... ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ క్లియరెన్స్ కూడా పొందిందని... పరీక్షలు నిర్వహించింది... మొత్తం 30,000 ప్రభుత్వ ఉద్యోగాల కోసం సర్టిఫికేట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసింది కూడా బీఆర్ఎస్ హయాంలోనే అని పేర్కొంది. అయితే అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వం నియామక పత్రాలు ఇవ్వలేకపోయిందని... ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ క్రెడిట్ తాను తీసుకుంటోందని పేర్కొంది.

# బయటపడే మార్గమే లేదక్కా..

## కౌంట్‌డౌన్ మొదలైంది!

### ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై జైలు నుంచి సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన లేఖ



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త):(ఢిల్లీ):**
ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై జైలు నుంచి సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన లేఖ రాశారు. ఇప్పటి వరకూ కవితను టార్గెట్ చేస్తూ ఆయన ఎన్నో లేఖలు విడుదల చేశారు. కవితకు.. తనకు మధ్య జరిగిన ఛాటింగ్ వివరాలను సైతం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్నాళ్లుగా తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, రాజకీయ కక్ష సాధింపు అంటూ చెప్పినవన్నీ అబద్ధాలని తేలింది. ఇన్నాళ్లకు నిజం బయటికొచ్చిందని.. చేసిన పనుల కర్మ ఫలం ఇప్పుడు వెంటాడుతోందని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు.
"నిజం శక్తి ఏంటో తెలుసుకోవాలి. ఎదుర్కోవాల్సి ఉంటుంది. నన్ను ఎవరూ ఏమి చేయలేరని అనుకునేవారు. కానీ కొత్త భారతదేశంలో చట్టమే అన్నింటికన్నా శక్తివంతమైంది. నేను గతంలో మీడియాకు విడుదల చేసిన లేఖల్లో 2 అంశాలు పొందుపరిచాను. అందులో ఒకటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవుతుంది.. రెండోది తిహార్ క్లబ్‌లో చేరేందుకు కవితకు కౌంట్ డౌన్ మొదలైంది. ఈ రెండూ ఇప్పుడు నిజమయ్యాయని అనిపిస్తోంది. కవిత అరెస్టుతో అవినీతి పండోరా బాక్స్ ఓపెన్ అయింది. కవితతో పాటు ఆమె అవినీతి సహాయకులు, అవినీతి రాజు అరవింద్ కేజ్రీవాల్ చేసిన అక్రమాలన్నీ బయటపడతాయి.

#### కేజ్రీ, సిసోడియాతో కవిత కుమ్మక్కు

వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసి సింగపూర్, హాంగ్‌కాంగ్, జర్మనీ వంటి దేశాలకు పంపిన విషయాలు బయటికొస్తాయి. ఇది ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైందని అనుకుంటున్నాను. అక్కా!..నేను వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్ల ద్వారా బయటపెట్టిన నెయ్యి డబ్బాల కథలు, రేంజ్ రోవర్ కలెక్షన్ కథలు, గోవా కథలు, కాంట్రాక్ట్ కథలు దర్యాప్తులో నిజమని తేలాయి. బయటపడే మార్గమే లేదు అక్కా. ఇప్పటికైనా నా విన్నపం ఒక్కటే.. అవినీతి సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్‌ను కాపాడేందుకు నిజాన్ని దాచే ప్రయత్నం చేయవద్దు. ఎందుకంటే ఈ దేశ ప్రజలు, న్యాయస్థానాలు నిజం తెలుసుకున్నాయి. ఇందుకు కావాల్సినంత సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నాయి.

#### రూ.300 కోట్ల ఘరానా మోసం!

ఏదేమైనా ఈడీ, సీబీఐ కన్‌ఫ్రంటేషన్ లో భాగంగా మిమ్మల్ని త్వరలోనే ముఖాముఖి చూస్తాను అక్కా.. మా గ్రేటెస్ట్ తిహార్ జైలుకు స్వాగతం అక్కా.. మీ మరో సోదరుడు, అవితిని సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ మీకు జైల్‌లో లగ్జరీ జీవితం అందంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఉంటారు. ఈ లేఖను ముగించే ముందు మరొక్క మాట చెప్పదల్చుకున్నా.. 'సినిమా ఇంకా మిగిలే ఉంది' కేజ్రీవాల్ జీ.. తదుపరి ఇక మీరే. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదు. సినిమా క్లైమాక్స్‌కు చేరుకుంది. కేజ్రీవాల్ జీ.. నా సోదరసోదరీమణులకు తిహార్ క్లబ్‌కు స్వాగతం పలుకుతున్నాను" అని సుఖేష్ చంద్రశేఖర్ లేఖలో పేర్కొన్నారు.

# పంచ 'న్యాయ్'లతో ప్రజలకు న్యాయం

(మొదటి పేజి తరువాయి)
శ్రామికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఇచ్చిన ఐదు ప్రధాన ప్రజలకు న్యాయం దక్కేలా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. యువత, మహిళలు, కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల పి.చిదంబరం నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన మేనిఫెస్టోకు ఆమోదం తెలిపిన సీడబ్ల్యూసీ, మరో మూడు, నాలుగు రోజుల్లో పూర్తి మేనిఫెస్టోను అధికారికంగా ప్రజల ముందుంచే బాధ్యతను పార్టీ చీఫ్ ఖర్గేకు కట్టబెట్టింది. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ మేనిఫెస్టోపై చర్చించి, ఆమోదించేందుకు సీడబ్ల్యూసీ మంగళవారం ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో భేటీ అయింది. ఈ సమావేశానికి పార్టీ మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు అంబికా సోనీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. 'దేశం మార్పును కోరుకుంటోంది. 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన 'భారత్ వెలిగిపోతోంది' నినాదానికి ఏ గతి పట్టిందో, ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న గ్యారంటీలకు అదే గతి పడుతుంది' అని ఖర్గే వ్యాఖ్యానించారు.

# యుపిఎస్‌సి సివిల్స్ పరీక్ష వాయిదా

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త):(ఢిల్లీ):**
అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే యుపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష, ఫారెస్ట్ సర్వీస్ స్క్రీనింగ్ పరీక్షలు వాయిదా పడ్డాయి. గతంలో వేర్వేరుగా ప్రకటించిన రెండు నోటిఫికేషన్ల ప్రకారం.. ప్రిలిమినరీ పరీక్ష మే 26న జరగాల్సిఉంది. అయితే, లోక్‌సభ ఎన్నికల కారణంగా ఈ పరీక్షల్ని రీషెడ్యూల్ చేస్తూ యుపిఎస్‌సి నిర్ణయం తీసుకుంది.
అలాగే, ఈ రెండు పరీక్షలను జూన్ 16న ఈ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సివిల్ సర్వీసెస్‌లో 1,056, ఫారెస్ట్ సర్వీసుల్లో 150 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దరఖాస్తుల గడువు మార్చి 6తో ముగిసింది. యుపిఎస్‌సి మెయిన్స్ అక్టోబర్ 19న నిర్వహించనున్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన లక్షల మంది అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## : హరీశ్‌రావు

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:** అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. 'ఎక్స్' వేదికగా మంగళవారం ఆయన స్పందించారు."ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన రైతుల్ని అతలాకుతలం చేసింది. పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన ఈ వాన వారికి కన్నీరు మిగిల్చింది. వరి, మొక్కజొన్న, జొన్న పంటలతో పాటు బొప్పాయి, మామిడి సహా ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. గతంలో రైతులు నష్టపోతే, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతులను పరామర్శించి, పరిహారం ప్రకటించి భరోసా కల్పించారు. కాంగ్రెస్.. ఇప్పటికైనా మేల్కొని అన్నదాతకు అండగా నిలవాలి. పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయడంతో పాటు, ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం చెల్లించాల"ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఈ కార్యాలయాన్ని మర్చిపోవాల్సిందే



**వర్ధన్నపేట, మార్చి19(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని నీటిపారుదల శాఖ తీరు మారడం లేదు. మంగళవారం మళ్లీ కార్యాలయం మూసివేసి రైతులకు దర్శనమిస్తుంది. గతంలో కార్యాలయ నిర్వాహకులు లేని కారణంగా రెండు నుంచి మూడు రోజులు కార్యాలయం చుట్టూ తిరిగి విసుగెత్తిన రైతులు ప్రతిపక్ష పార్టీల నేతలతో వెళ్లి బోర్డుకి వినతిపత్రం ఇచ్చిన మాదిరిగానే వ్యవహారం సాగుతోంది. ఇంత జరిగిన వారిలో కదలిక లేదంటే ఇక కార్యాలయం తీయడం సాధ్యమయ్యే పని కాదని స్థానికులు మాట్లాడుతున్నారు. వర్ధన్నపేటలో అన్ని శాఖలకు చెందిన కార్యాలయాలు లేకపోయినప్పటికీ ఉన్న కార్యాలయాలు తీయడం లేదనే స్థానిక వాదన వ్యక్తం అవుతుంది. చివరిగా రైతులు ఆ కార్యాలయాన్ని మర్చిపోవాల్సిందేనని వాదన వినిపిస్తోంది.

# మోసపూరిత మాటలు విని విమర్శలు చేయడం కరెక్ట్ కాదు

## - కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మైస సురేష్

**వర్ధన్నపేట, మార్చి 19(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎంఎంఆర్ గార్డెన్ లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమావేశమైనారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులుగా ఇటీవల ఎంపికైన మైస సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తలుగా కొనసాగుతున్న వారు మోసపూరిత మాటలు విని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పై విమర్శలు చేయడం కరెక్ట్ కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ నాయకులుగా వ్యవహరిస్తున్న వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన ఓ సీనియర్ నాయకులు ముఖ్య కార్యకర్తలను దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విమర్శించారు. ఎమ్మెల్యేను విమర్శించే పరిస్థితి వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేసిన సంగతి కార్యకర్తలు మర్చిపోవడం సరైన పద్ధతి కాదన్నారు. విమర్శించే ముందు ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే అన్న సంగతి మర్చిపోవద్దు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నమ్మిన వారిని మోసం చేసే



పార్టీ కాదన్నారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని వివరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నుండి ఇతర పార్టీలకు ప్యాకేజీలు మాట్లాడి కార్యకర్తలను పంపించే ఘనత ఆ వ్యక్తికి ఉందన్నారు. అలాంటి నాయకుని మాటలు నమ్మడం కార్యకర్తలకు శ్రేష్టకరం కాదన్నారు. ఈ సందర్భంగా తన నియమాకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మంచాల రామకృష్ణ, సిలివేరు శ్రీధర్, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, గుజ్జ వీర రాఘవరావు, భీమా నాయక్, దుబ్బాక శివ, పాపారావు, దేవేంద్ర యాదవ్, సుజాత, ఆరెల్లి ప్రభాకర్, మైబెల్లి, రాజేందర్, బాబూలాల్, పిన్నింటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# మానవత్వం చాటుకున్న బాల్య మిత్రులు

**రాయపర్తి, మార్చి19(జర్నలిస్ట్ వార్త):**
రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన నారోజ్ ఉపేంద్ర చారి గోల్డ్ స్మిత్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే వారు. వృత్తిలో భాగంగా వరంగల్ వెళ్లడానికి బస్సులో బయల్దేరారు. హఠాత్తుగా మార్గ మధ్యలో ఆయనకు హార్ట్ స్ట్రోక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అతనితో పాటు 91- 92 సంవత్సరంలో చదువుకున్న 10వ, తరగతి బాల్య మిత్రులు మంగళవారం చారి కుటుంబాన్ని సందర్శించి, పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితి గమనించి చారి కుటుంబానికి 25 వేల రుపాయల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ పరామర్శలో బైరి యాకయ్య, లెక్కల మహేందర్ రెడ్డి , రవీందర్ రెడ్డి, కంది కుమార్, తుమ్మ రాంరెడ్డి, శ్రీధర్, కుమార్, ఈరెడ్డి నరసింహారెడ్డి, బాల్యమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



రాయపర్తి,మార్చి19(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రానికి చెందిన బిఆర్ ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వర్ధన్నపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్, రాయపర్తి మాజీ సర్పంచ్ ఎండి ఉస్మాన్, బిఆర్ఎస్ మండల నాయకులు మల్లెల నర్సింహా మూర్తి బిఆర్ఎస్ కి గుడ్ బై చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సీ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ఎండి మహమూద్,పాక్స్ డైరెక్టర్ కుంట రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోతి వీరన్న, ముద్రబోయిన వెంకటేశ్వర్లు,కోతి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# దందాలు చేసేవారే పార్టీని వీడుతున్నారు

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**వర్ధన్నపేట, మార్చి 19(జర్నలిస్ట్ వార్త):**
వ్యాపారాలు, భూకబ్జాలు, దందాలు చేసే నాయకులే భారాస పార్టీని వీడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. రాజకీయ జీవితంలో అనేక మంది ముఖ్యమంత్రులను చూశానని, దివంగత నేత వైఎస్సార్ ఎన్నో ఇబ్బందులకు గురి చేసినా తాను పార్టీ మారలేదని చెప్పారు. ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోనే తామంతా కొనసాగుతామని స్పష్టం చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి అరెస్టయిన మాజీ డీఎస్పీ



ప్రణీత్‌రావు మీకు బంధువని, వార్‌రూమ్ పర్వతగిరిలో నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయ'ని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు దయాకర్‌రావు స్పందించారు. ప్రణీత్‌రావు అమ్మమ్మ స్వగ్రామం పర్వతగిరి అని మాత్రమే తెలుసునని, అంతకు మించి ఆయన ఎవరో తనకు తెలియదన్నారు. ఫోన్ ట్యాపింగ్, వార్ రూమ్ గురించి కూడా తనకేమీ తెలియదని చెప్పారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. మాయ మాటలు చెప్పి మోసాలు చేయడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటేనన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే తామంతా వచ్చి ఠాణాల్లో బైఠాయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ లోక్‌సభ భారాస అభ్యర్థి డా.కడియం కావ్య, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు భక్తి భావన కలిగి ఉండాలి



రాయపర్తి, మార్చి19(జర్నలిస్ట్ వార్త): ప్రతి ఒక్కరు భక్తి భావన పెంపొందించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుబ్బడి తండాలో దుర్గమ్మతల్లి నూతన ఆలయ విగ్రహప్రతిష్టపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హామ్య నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు ,మాచర్ల ప్రభాకర్, సరికొండ కృష్ణారెడ్డి , ముద్రభోయిన వెంకటేశ్వర్లు, ఉల్లే%శీ%గుల నరసయ్య, ఇల్లదుల భగవాన్, ఈరెడ్డి నర్సింహా రెడ్డీ, టౌన్ అధ్యక్షులు మచ్చ రమేష్,కు%శీ%ట రమేష్ , మహముద్, మచ్చ నీలయ్య,గారె బిక్షపతి ,కోతి వీరన్న, మాజీ ఎంపీటీసీ గోవింద్, గుగులోతు విజయ్ నాయక్, యాకుబ్,యాదగిరి,కృష్ణ,రామ, నరే%శీ%దర్, సొమ్లు, జలగం యాకాయ్య , ఎస్ కే రఫీ , ప్రవీణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా ఢిల్లీలో మాట్లాడుతాను

## : వరంగల్ బీఆర్ఎస్ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్య

**బీఆర్ఎస్ తెలంగాణ ప్రయోజనాల కోసం ఏర్పడిన పార్టీ అన్న కడియం కావ్య**

**బీజేపీ కొత్తగా వచ్చిన పార్టీ ఏమీ కాదు... పదేళ్లుగా తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఆగ్రహం**

**కేసీఆర్‌కు మాత్రం తెలంగాణ ప్రయోజనాలు తప్ప వేరే లేదని వ్యాఖ్య**

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)** వరంగల్ :
పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ లోక్ సభ నుంచి తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజల గొంతుకగా ఢిల్లీలో మాట్లాడుతానని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. వరంగల్ బీఆర్ఎస్ ఎంపీగా తనను గెలిపించమని ప్రజలందరినీ వేడుకుంటున్నానన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు.
బీజేపీ కొత్తగా వచ్చిన పార్టీ ఏమీ కాదని... గత పదేళ్లుగా తెలంగాణకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీకి చెందిన పార్లమెంట్ సభ్యులు వారి నాయత్వం ప్రకారం నడుచుకుంటారని... వారికి తెలంగాణ



ప్రయోజనాలు అవసరం లేదని వ్యాఖ్యానించారు. కానీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ ప్రయోజనాలు తప్ప వేరే అవసరం లేదన్నారు.

# గెలుపు గుర్రాలకే లోక్ సభ అభ్యర్థిత్వం



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:** ఢిల్లీలోని ఏఐసిసి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్ష న్ కమిటీ సమావేశంలో 9 మంది అ భ్యర్థుల పేర్లు కొలిక్కి వచ్చినట్టుగా తెలిసిం ది. అయితే ఇందులో కొత్తగా పార్టీలో చే రినవారితో పాటుగతంలో కాంగ్రెస్ నుం చి వేరే పార్టీకి వెళ్లి మళ్లీ ప్రస్తుతం కాం గ్రెస్ పార్టీలో చేరిన వారికి టికెట్ లభించినట్టుగా తెలిసింది. కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్‌లు ఇవ్వొద్దని పార్టీ కేడర్ సూచించినా సర్వేలు వారికి అనుకూలం గా రావడంతో ఏఐసిసి నాయకులు సై తం వీరికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. ఢిల్లీలో జరిగిన సీఈసీ ఈ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసిసి అగ్రనేతలు సో నియా గాంధీ, కెసి వేణుగోపాల్, తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఇతర సభ్యులు హాజరయ్యారు. సెంట్రల్ ఎలక్ష న్ కమిటీ సమావేశంలో కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, చండీగడ్, సిక్కిం , వెస్ట్ బెంగాల్, అండమాన్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల లోక్ సభ అభ్యర్థులపై కసరత్తు చేసినట్టుగా తెలిసింది. ఇక తెలంగాణ నుంచి టిపిసిసి ప్రెసిడెంట్, సిఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇప్పటి వరకు రెండు జాబితా ల్లో 82 లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. తెలంగాణలో 17 లోక్ సభ స్థానాల్లో 4 ఎంపి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. 13 పార్లమెంట్ స్థానాలపై మంగళవారం జరిగిన సమావేశంలో చర్చించడంతో పాటు అభ్యర్థుల పేర్లపై సీఈసీ సభ్యులు ఏకాభిప్రాయయానికి వచ్చినట్టుగా తెలిపింది. ఈ అభ్యర్థుల జాబితాను నేడు లేదా రేపు ప్రకటించే అవకాశం ఉన్నట్టుగా సమాచారం.గెలుపే ప్రధానం అన్న లక్ష్యంతో 13 లోకసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక విషయంలో అన్ని అంశాలను ఏఐసిసి పరిగణనలోకి తీసుకుంటుం ది. ఓ వైపు సామాజిక సమతుల్యత పాటిస్తూనే మరోవైపు విజయం సాధించే ప్రజాబలం కలిగిన వారికే టికెట్లు ఇచ్చే దిశగా కాంగ్రెస్ నాయకత్వం ముందు కు వెళుతుంది. ముఖ్యంగా జనాదరణ ఉన్న నాయకులనే బరిలో దించాలని రాష్ట్ర నాయకత్వం కసరత్తు చేస్తోంది. మొదటి జాబితాలో జహీరాబాద్, మహబూబాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ లోకసభ నియోజకవర్గాలకు ఏఐసిసి ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను, సర్వేలను పరిగణలోకి తీసుకొని అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఏఐసిసి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం కుటుంబ సభ్యులకు సీట్ల విషయమై కూడా ఇందులో చర్చకు వచ్చినట్టుగా తెలిసింది. అయితే ఈ సమావేశంలో భాగంగా మరోసారి ఖమ్మం, భువనగిరి, ఆదిలాబాద్, పెద్దపల్లి నియోజకవర్గాల అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టినట్టుగా తెలిసింది. భువనగిరి నుంచి బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రె డ్డి సతీమణి లక్ష్మి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కం చర్ల చంద్రశేఖర్‌రెడ్డిలు పోటీ పడుతుండగా, ఆదిలాబాద్ నుంచి డా.సుమలత, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ లు, ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డిలు, తుమ్మల కుటుంబ సభ్యు లు పోటీ పడుతుండగా, పెద్దపల్లి నుంచి వివేక్ కు మారుడు వంశీ, గజ్జెల కాంతం, మాజీ ఎంపి సు గుణ కుమారిలు పోటీ పడుతున్నారు.

### 9 సీట్లపై ఏకాభిప్రాయం

కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో 9 పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి సభ్యులంతా ఏకాభిప్రాయానికి వచ్చినట్టుగా తెలిసింది. రెండు రోజుల్లో జాబితా వెల్లడించే అవకాశం ఉన్నట్టుగా కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏకాభిప్రాయానికి వచ్చిన 9 సీట్లలో సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, చేవెళ్ల నుంచి రంజిత్ రెడ్డి, మెదక్ నుంచి నీలం మధు, మల్కాజిగిరి నుంచి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, వరంగల్ నుంచి పసునూరి దయాకర్, హైదరాబాద్ నుంచి షానవాజ్, కరీంనగర్ ప్రవీణ్‌రెడ్డి, నిజామాబాద్ టి.జీవన్‌రెడ్డి, నాగర్ కర్నూల్ మల్లు రవిలను అభ్యర్థులుగా ఫైనల్

# పురుషుల్లోనూ రొమ్ము కేన్సర్..

## ఈ లక్షలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:** రొమ్ము కేన్సర్ అనగానే అదేదో మహిళలకు మాత్రమే వచ్చేదని అందరూ భావిస్తుంటారు. అయితే, ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు. రొమ్ము కేన్సర్ అనేది ఇటీవల పురుషుల్లోనూ ఎక్కువగా బయటపడుతోంది. ఎంతలా అంటే.. 0.5 నుంచి ఒకశాతం వరకు పురషులు కూడా దీని బారినపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజా గణాంకాలు చెబుతున్నారు. 2022లో ప్రపంచవ్యాప్తంగా 6.70 లక్షల మంది రొమ్ము క్యాన్సర్ బారినపడ్డారు. 185 దేశాల్లోని 157 దేశాల్లో బ్రెస్ట్ క్యాన్సర్ అనేది సర్వసాధారణ విషయంగా మారిపోయింది. అంటే దాదాపు ప్రతిదేశంలోనూ ఇది వేళ్లూనుకున్నట్టే లెక్క.

### పురుషుల్లోనూ అంతే..

రొమ్ము కేన్సర్ ఏర్పడడానికి మహిళల్లో ఏవైతే కారణమవుతాయో, లేదంటే ఎలా ఏర్పడతాయో.. పురుషుల్లోనూ ఇంచుమించుగా అవే కారణాలు మారుతాయి.. కేన్సర్ కణాలు అలాగే పురుడుపోసుకుంటాయి. ఎందుకంటే పుట్టినప్పుడు స్త్రీపురుషుల్లో రొమ్ము నాళాలు ఒకే రకంగా ఉంటాయి. కాబట్టి బ్రెస్ట్ కేన్సర్ ఇద్దరికీ సోకే అవకాశం ఉంది. అయినప్పటికీ మహిళలే ఎక్కువగా దీని బారినపడుతున్నారు. పురుషుల్లో రొమ్ము కేన్సర్ అరుదే అయినప్పటికీ ఇటీవలి కాలంలో ఎక్కువమంది దాని బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా ఇది పెద్ద వయసులో వచ్చే ప్రమాదం ఉన్నప్పటికీ ఏ వయసులోనైనా ఇది సంక్రమించగలదు.

### అసలేంటీ రొమ్ము కేన్సర్?

రొమ్ము కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వల్ల రొమ్ములో కణతులు ఏర్పడతాయి. వీటిని ఇలాగే వదిలేస్తే ఆపై అవి శరీరమంతా పాకి ప్రాణాంతకంగా మారతాయి. బ్రెస్ట్ కేన్సర్ కణాలు పాల నాళాలు, లేదంటే పాలను ఉత్పత్తి చేసే లోబుల్స్ (చిన్నకణజాలం లాంటిది)లో పెరుగుతాయి. ఆ తర్వాత అవి రొమ్ము కణజాలంలోకి చేరుకుని కణతులు ఏర్పరుస్తాయి. దీనికి చికిత్స అనేది ఆయా వ్యక్తుల శరీరతత్వం, కేన్సర్ రకం వంటివాటిపై ఆధారపడి ఉంటుంది. శస్త్రచికిత్స, రేడియేషన్ థెరపీ వంటివాటి ద్వారా దీనికి అడ్డుకట్ట వేయవచ్చు.

### ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త

సాధారణంగా బ్రెస్ట్ కేన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించడం కష్టం. అది ముదురుతున్న సమయంలో బయటపడుతుంది. నొప్పి లేకుండానే రొమ్ము తరచూ గట్టిపడడం, రొమ్ము పరిమాణం, ఆకారం మారుతుండడం, చనుమొనలు ఎరుపురంగంలోకి మారడం, చర్మంపై ఇతర మార్పులు, చనుమొన నుంచి అసాధారణమైన, లేదంటే రక్తం స్రవిస్తుండడం, రొమ్ము గట్టిగా అనిపించినా నొప్పి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీచేసింది.

# 'రజాకార్' మూవీ కోసం సీఏం రేవంత్ రెడ్డికి బీజేపీ నేత బండి సంజయ్ లేఖ

**ఈ సినిమాకు వినోదపు పన్ను నుండి మినహాయింపు ఇవ్వాలని వినతి**

**స్కూల్, కాలేజీ విద్యార్థులకు రజాకార్ మూవీని చూపించాలన్న సంజయ్**



**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)హైదరాబాద్:** 'రజాకార్' మూవీ విషయమై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ నేత బండి సంజయ్ తాజాగా ఓ లేఖ రాశారు. ఈ సినిమాకు వినోదపు పన్ను నుండి మినహాయింపు ఇవ్వడంతో పాటు స్కూల్, కాలేజీ విద్యార్థులకు మూవీని చూపించాలని బండి సంజయ్ తన లేఖ ద్వారా సీఏంను కోరారు. రజాకార్ల రాక్షస పాలనలో తెలంగాణ ప్రజలు పడ్డ బాధలను కళ్లకు కట్టినట్లు చూపిన చిత్రం 'రజాకార్' అని అన్నారు. అలాగే నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించి స్వేచ్ఛా వాయువును అందించేందుకు జరిగిన పోరాటాలు, రజాకార్ల రాక్షసత్వంపై పోరాడి ప్రాణాలు విడిచిన యోధుల చరిత్ర, తెలంగాణ ప్రజలకు విమోచన కల్పించేందుకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని ఈ మూవీలో అద్భుతంగా చూపించారని బండి సంజయ్ కితాబునిచ్చారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాన్ని తెలంగాణ ప్రజలకు అందించిన సినిమా దర్శక, నిర్మాతలకు, చిత్ర బృందానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఇలాంటి మంచి మూవీని తీసిన వారికి ప్రభుత్వపరంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బండి సంజయ్ గుర్తు చేశారు. తద్వారా ప్రజల్లోకి మంచి సందేశం పంపినట్లవుతుందని చెప్పుకొచ్చారు. ప్రధానంగా ఎన్నో ఆటుపోట్లను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని నిర్మించిన రజాకార్ సినిమాకు వినోదపు పన్ను నుండి మినహాయింపు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. థియేటర్లలో ప్రత్యేక షోలు వేసి, పాఠశాల, కళాశాల విద్యార్థులకు చూపించాలని కోరడం జరిగింది. దాంతో నాటి మహనీయులను స్మరించుకోవడంతో పాటు వారి పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఇంతటి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న 'రజాకార్' సినిమాను థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టేందుకు యత్నిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకుని ఇలాంటి సందేశాత్మక చిత్రాలను వీలైనంత ఎక్కువ థియేటర్లలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ తన లేఖలో పేర్కొన్నారు.

# బ్రిజ్‌భూషణ్ లాంటి వాళ్లను సాగనంపండి

## ప్రధానికి రెజ్లర్ల విజ్ఞప్తి

**మార్చి 19(జర్నలిస్ట్ వార్త)దిల్లీ:** భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ లాంటి వాళ్లను క్రీడా సంఘాలకు దూరంగా ఉండేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ విజ్ఞప్తి చేశారు. పలువురు మహిళా రెజ్లర్లతో అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా గత ఏడాది వినేశ్, సాక్షి సహా పలువురు రెజ్లర్లు దిల్లీలో చాలా రోజుల పాటు నిరసన చేసిన సంగతి తెలిసిందే. తన పదవీ కాలం ముగియగానే బ్రిజ్‌భూషణ్ తప్పుకొన్నప్పటికీ.. తర్వాత జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచిన సంజయ్ సింగ్ అతడి అనుచరుడే కావడంతో రెజ్లర్ల అభ్యంతరాలు కొనసాగుతున్నాయి. సంజయ్ సాయంతో డబ్ల్యూఎఫ్ఐపై బ్రిజ్‌భూషణ్ పట్టు కొనసాగిస్తాడని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే బ్రిజ్‌భూషణ్ లాంటి వాళ్లను నియంత్రించాలని ప్రధానికి వినేశ్, సాక్షి 'ఎక్స్' ద్వారా విన్నవించారు. "ప్రధాని తన ప్రసంగాల్లో ప్రత్యర్థులను విమర్శించే క్రమంలో మహిళా శక్తి గురించి ప్రస్తావిస్తుంటారు. బ్రిజ్‌భూషణ్ మహిళా రెజ్లర్లను వేధించాడు. రెజ్లింగ్‌ను గుప్పెట్లో ఉంచుకున్నాడు. అలాంటి వారిని క్రీడా సంఘాలకు దూరంగా






ఉంచేలా ప్రధాని చర్యలు చేపడతారని ఆశిస్తున్నాం" అని వినేశ్ పేర్కొంది. "డబ్ల్యూఎఫ్ఐని ప్రభుత్వం సస్పెండ్ చేసినప్పటికీ.. బ్రిజ్‌భూషణ్, సంజయ్ సింగ్ ఇదంతా ఒక డ్రామానే అని, త్వరలోనే సమాఖ్యపై తాము నియంత్రణ సాధిస్తామనే మాట్లాడుతూ వచ్చారు. డబ్ల్యూఎఫ్ఐ నిషేధాన్ని తొలగిస్తూ భారత ఒలింపిక్ సంఘం తాజాగా విడుదల చేసిన లేఖను బట్టి చూస్తే ఇది నిజమే అనిపిస్తోంది" అని సాక్షి తన పోస్టులో పేర్కొంది.

# రొమాంటిక్ కామెడీ జోనర్లో 'తులసీవనం' .. ఈటీవీ విన్ లో!



ఈటీవీ విన్ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ ద్వారా ఓ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ పలకరించనుంది. ఆ రొమాంటిక్ ఎంటర్టైనర్ పేరే 'తులసీవనం'. అక్షయ్ .. ఐశ్వర్య .. వెంకటేశ్ కాకుమాను .. విష్ణు ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ కి అనిల్ రెడ్డి దర్శకత్వం వహించాడు. తరుణ్ భాస్కర్ ఈ సిరీస్ ను సమర్పిస్తున్నాడు.ఈ సిరీస్ ను ఈ నెల 21వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. అందుకు సంబంధించిన అధికారిక పోస్టర్ ఈటీవీ విన్ నుంచి వచ్చేసింది. లవ్ .. రొమాన్స్ .. కామెడీ .. ఫ్రెండ్షిప్ .. ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు, స్ట్రీట్ క్రికెట్ నేపథ్యాన్ని కూడా తోడుగా చేసుకుని ఈ సిరీస్ నడుస్తుంది. స్మరణ్ అందించిన సంగీతం ఈ సిరీస్ కి ప్రత్యేక ఆకర్షణ అవుతుందని భావిస్తున్నారు. స్వాగత్ రెడ్డి – నీలిత పైడిపల్లి ఈ సిరీస్ ను నిర్మించారు. ఈ మధ్య కాలంలో ఈటీవీ విన్ వెబ్ సిరీస్ ల విషయంలో కాస్త జోరు పెంచడం కనిపిస్తోంది. అలాగే ఫ్యామిలీ ఆడియన్స్ ను దృష్టిలో పెట్టుకుని ఈ కంటెంట్ ను కూడా ట్రాక్ పైకి తీసుకొస్తోంది. ఈ సిరీస్ ఎంతవరకూ ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుందనేది చూడాలి మరి.

# గ్లాస్ అంటే సైజ్ కాదు .. సైన్యం

## 'ఉస్తాద్ భగత్ సింగ్' గా పవన్ డైలాగ్



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్ ను వదిలిన దగ్గర నుంచి అంచనాలు పెరుగుతూ వెళుతున్నాయి. ఈ సినిమాకి సంబంధించిన షూటింగు కొంతవరకూ జరిగింది. ఎన్నికల తరువాత నుంచి మళ్లీ పవన్ ఈ సినిమా షూటింగులో పాల్గొననున్నాడు. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి 'భగత్స్ బ్లేజ్' పేరుతో కొంతసేపటి క్రితం ఒక వీడియోను రిలీజ్ చేశారు. జాతర సమయంలో హింసకి పాల్పడటానికి ట్రై చేసిన రౌడీ మూకకి పోలీస్ ఆఫీసర్ గా పవన్ బుద్ధి చెప్పడం ఈ వీడియోలో చూపించారు. ఆ సందర్భంలో 'గాజు పగిలేకొద్దీ పదునెక్కుద్ది .. కచ్చితంగా గుర్తుపెట్టుకో .. గ్లాస్ అంటే సైజ్ కాదు .. సైన్యం .. కనిపించని సైన్యం' అంటూ పవన్ చెప్పిన డైలాగ్స్ ఆయన ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటాయి. మైత్రీ మూవీ మేకర్స్ వారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూర్చుతున్న ఈ సినిమాలో, శ్రీలీల కథానాయికగా అలరించనుంది. ఈ సినిమాతో పాటు సుజీత్ దర్శకత్వంలో పవన్ OG చేస్తున్నాడు. సెప్టెంబర్ 27న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఇక క్రిష్ దర్శకత్వంలో చేస్తున్న 'హరి హర వీరమల్లు' సెట్స్ పైనే ఉంది.

# హాట్ బ్యూటీ త్రిప్తి డిమ్రి .. అందానికి తోడైన అదృష్టం!



ఇండస్ట్రీలో ఎవరికి ఎప్పుడు క్రేజ్ వస్తుందో .. ఎవరు ఎప్పుడు పాప్యులర్ అవుతారనేది ఎవరికీ తెలియదు. సరైన సినిమా .. సరైన పాత్ర పడితే చాలు, ఆ తరువాత ఎక్కడ చూసినా వాళ్లను గురించి మాట్లాడుకునేవారు కనిపిస్తారు. ఎవరు ఎక్కడ మాట్లాడుకుంటున్నా అక్కడ వారి పేరే వినిపిస్తూ ఉంటుంది. అలా ఈ మధ్య కాలంలో చాలామంది నోటి నుంచి వినిపించిన పేరు 'త్రిప్తి డిమ్రి'.'యానిమల్' సినిమా రావడానికి ముందు ఈ సుందరి పేరు చాలామందికి పెద్దగా తెలియదు. ఆ తరువాత ఈ బ్యూటీ గురించి తెలియని వారు లేరు. అంతగా ఆమె తన పాత్ర ద్వారా ప్రేక్షకులను ప్రభావితం చేసింది. ఈ సినిమాలో ఆమె బోల్డ్ సీన్స్ లో ఎక్కువగా కనిపిస్తుంది. చక్కని కనుముక్కుతీరుతో .. గ్లామర్ పరంగా కుర్రాళ్ల మనసులను దోచేసింది. ఈ సినిమా తరువాత సోషల్ మీడియాలో ఆమె ఫాలోయింగ్ అమాంతంగా పెరిగిపోయింది.ఇటీవలే బాలీవుడ్ నుంచి వచ్చిన ఊర్వశీ రౌతేలా ఐటమ్ సాంగ్స్ తో ఇక్కడ దూసుకుపోతోంది. కొన్ని సినిమాల్లో ముఖ్యమైన పాత్రలలోను కనిపించనుంది. అలాగే త్రిప్తి డిమ్రిని రంగంలోకి దింపడానికి ఇక్కడి మేకర్స్ పోటీపడుతున్నారు. ఆల్రెడీ రవితేజ – అనిల్ రావిపూడి సినిమా కోసం, విజయ్ దేవరకొండ – గౌతమ్ తిన్ననూరి సినిమా కోసం ఆమె ఎంపిక జరిగిపోయిందనే టాక్ వినిపిస్తోంది. ఇక కొంతమంది తమ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా ఆమె ఉండాల్సిందే అనే ఉద్దేశంతో గట్టిగానే సంప్రదింపులు జరుపుతున్నారని వినికిడి.


# నగలు తాకట్టుపెట్టి ఆ సినిమా తీశాను

**: నిర్మాత ఎమ్మెస్ రాజు**



నిర్మాతగా ఎమ్మెస్ రాజు భారీ విజయాలను అందుకున్నారు. అప్పట్లో ఆయన బ్యానర్ నుంచి సినిమా వస్తుందంటే, అది పెద్ద సినిమాగా అంతా భావించేవారు. తప్పకుండా హిట్ కొడుతుందని ఆశించేవారు. అలా ఆయన నిర్మించిన సినిమాలలో 'దేవి' ఒకటి. ప్రేమ ప్రధానమైన పాత్రను పోషించిన ఆ సినిమా అప్పట్లో ఘనవిజయాన్ని అందుకుంది. ఆ సినిమా మార్చి 12తో పాతికేళ్లను పూర్తిచేసుకుంది. "ఈ సందర్భంగా ఎన్టీవీ ఎంటర్టైన్ మెంట్ తో ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ .. "ఒక రోజున నాకు కలలో పాములు కనిపించాయి. అప్పుడే నాకు పాములపై సినిమా తీస్తే ఎలా ఉంటుందా అనిపించింది. అదే విషయం కోడి రామకృష్ణగారికి చెబితే ఆయన కథను రెడీ చేసుకున్నారు. కోటిన్నరతో సినిమాను పూర్తి చేయాలనే ఆలోచనతో రంగంలోకి దిగాను. గ్రాఫిక్స్ చేయించాలనుకున్నప్పుడు అందుకు సంబంధించిన సీన్స్ ను ముందుగా పూర్తి చేయాలనే విషయం తెలియకపోవడం వలన ఆలస్యమైపోయింది" అన్నారు. "గ్రాఫిక్స్ కి ఒక పాతిక నుంచి యాభైవేలు కావొచ్చని అనుకుంటే, మొత్తం పూర్తయ్యేసరికి మూడున్నర కోట్లు అయింది. కానీ అప్పటికి అంతడబ్బు నా దగ్గర లేదు. వాళ్లకి ఏదో చెప్పి బ్రతిమాలుకున్నాను. అదే సమయంలో డీటీఎస్ వచ్చింది. ఈ సినిమాను డీటీఎస్ లో చేయడం కోసం ఇంట్లో ఉన్న మిగతా బంగారం కూడా అమ్మేశాను. అలా ఎన్నో కష్టాలుపడి తీసిన సినిమా అది" అని చెప్పారు.


# నిర్మాతగా కార్తికేయ.. పుష్ప స్టార్ తో 2 సినిమాలు




బాహుబలి మూవీ ప్రపంచ స్థాయిలో ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి రెండు భాగాలు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించాయి. అయితే ఈ చిత్రాల నిర్మాతల్లో ఒకరైన శోభూ యార్లగడ్డ.. బాహుబలితో తెలుగు సినిమాను పాన్ ఇండియా మార్కెట్ కు తీసుకెళ్లారు. ఇండస్ట్రీలో ఏ ప్రొడ్యూసర్ చేయలేనంత రిస్క్ చేసి సూపర్ సక్సెస్ అయ్యారు. అయితే శోభూ యార్లగడ్డ మంగళవారం ఉదయం.. తమ ఆర్కా మీడియా వర్క్స్ నుంచి ఒక ఎగ్జైటింగ్ అప్డేట్ రాబోతుందని ట్వీట్ చేశారు. దీంతో ఆ ప్రాజెక్ట్ ఏంటని అందరూ చర్చించుకున్నారు. ఏదో భారీ సినిమా అయ్యి ఉండవచ్చని అంతా అనుకున్నారు. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో రోషన్ తో ఓ సినిమా అనౌన్స్మెంట్ వస్తుందని భావించారు. ఇప్పుడు శోభూ యార్లగడ్డ.. అసలు విషయాన్ని ట్వీట్ చేశారు. తమ బ్యానర్ ఆర్కా మీడియా వర్క్స్ పై రెండు ప్రాజెక్టులను ప్రకటించారు శోభూ యార్లగడ్డ. ఈ రెండు సినిమాలకు డైరెక్టర్ రాజమౌళి కొడుకు కార్తికేయతోపాటు ప్రసాద్ దేవినేని సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇంకో క్రేజీ విషయమేమింటంటే.. పుష్ప, విక్రమ్ మూవీలతో టాలీవుడ్ ఆడియన్స్ కు దగ్గరైన ఫహాద్ ఫాజిల్ ఆ రెండు సినిమాల్లో హీరోగా నటిస్తున్నారు. రెండింటిలో ఒక సినిమాకు బాలయ్య ఫేమస్ డైలాగ్ డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ ను టైటిల్ గా పెట్టారు. ఫాంటసీ ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. ఇందులో ఫహాద్ ఫాజిల్ ఓ చిన్నారితో పోలీస్ కారుపై కనిపిస్తున్నారు. ఆ పాప ఓ మ్యాజిక్ పెన్సిల్ తో మాయాజాలం చేస్తున్నట్లు కనిపిస్తోంది. పోస్టర్ ను చూస్తుంటే.. ఓ ఇంట్రెస్టింగ్ ఎంటర్టైనర్ తెరకెక్కుతుందని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని కొత్త డైరెక్టర్ శశాంక్ యేలేటి తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది రిలీజ్ కానుందీ చిత్రం. ఇక మరో సినిమాను ఆక్సిజన్ గా అనౌన్స్ చేశారు. ఈ మూవీ ద్వారా సిద్ధార్థ్ నాదెళ్ల డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. స్ఫూర్తిదాయకమైన ఫ్రెండ్ షిప్ సబ్జెక్ట్ పై ఈ సినిమా తెరకెక్కనుంది. పోస్టర్ లో ఫహాద్ ఫాజిల్ మాస్క్ తో ఉండగా.. ఆయన ముఖంపై మ్యాప్ కనిపిస్తుంది. అయితే ఈ యంగ్ డైరెక్టర్లను పరిచయం చేస్తూ.. విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్ తో కలిసి పని చేయడం చాలా సంతోషంగా ఉందని నిర్మాత శోభూ యార్లగడ్డ ఆనందం వ్యక్తం చేశారు. కార్తికేయ కూడా ఈ సినిమాల గురించి సోషల్ మీడియాలో ట్వీట్లు చేశారు

# 20 కోట్ల ఖర్చు .. 200 కోట్ల వసూళ్లు ..

## మలయాళ మూవీ సంచలనం!




మలయాళ సినిమాలు ఈ మధ్య కాలంలో సరికొత్త రికార్డులను వసూలు చేస్తున్నాయి. ఒకప్పుడు అక్కడ స్టార్ హీరోల సినిమాలకు మాత్రమే లభించే వసూళ్లు, ఇప్పుడు చాలా చిన్న సినిమాలు రాబట్టేస్తున్నాయి. అలాంటి సినిమాల జాబితాలో తాజాగా 'మంజుమ్మెల్ బాయ్స్ ' చేరిపోయింది. ఫిబ్రవరి 22వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సౌబిన్ షాహిర్ .. బాబు షాహిర్ .. షావన్ ఆంటోని నిర్మించిన ఈ సినిమాకి చిదంబరం దర్శకత్వం వహించాడు. 2006లో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా ఈ కథ తెరకెక్కింది. కేరళకి చెందిన కొంతమంది విద్యార్థులు, తమిళనాడు ప్రాంతానికి విహారానికి వెళతారు. ఊహించని విధంగా అక్కడి గుహలో వారు చిక్కుకుపోతారు. లోపల వాళ్లు ఎలాంటి పరిస్థితులను ఫేస్ చేశారు? ఎలా బయటపడ్డారు? అనేదే కథ.

ఈ సినిమాను 20 కోట్ల రూపాయలతో నిర్మించారు. అలాంటి ఈ సినిమా ఇప్పుడు 200 కోట్ల మార్క్ ను టచ్ చేయడానికి సిద్ధమవుతోంది. అనుక్షణం ఉత్కంఠను కలిగించే ఈ సినిమాను, మైత్రీ మూవీస్ వారు తెలుగులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 29వ తేదీన ఈ సినిమాను ఇక్కడి థియేటర్లకు వచ్చే అవకాశం ఉంది. ఇక తెలుగు ఆడియన్స్ నుంచి ఈ సినిమా ఏ స్థాయి రెస్పాన్స్ ను రాబడుతుందనేది చూడాలి.